సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన


మాట్లాడుతున్న పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్


ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు

- ప్రతి కుటుంబానికీ పథకాల లబ్ధి
- అందుకే మళ్లీ ఆయనే సీఎం కావాలి
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

విశాఖ విద్య: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఏపీఎంఎస్‌ఈడీసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సచివాలయం పరిధి ఏపీఎస్‌ఈబీ కాలనీలో క్లస్టర్ మండల పార్టీ అధ్యక్షుడు బెహరా భాస్కరరావు, జేసీఎస్ క్లస్టర్ కన్వీనర్ గేదెల మురళీకృష్ణ పర్యవేక్షణలో వార్డు అధ్యక్షుడు నమ్మి శ్రీను, వార్డు ఇన్‌చార్జి చుక్క ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో గురువారం గడపకు గడపకు పర్యటించారు. జీవీఎంసీ షెల్టర్ ఎదుట ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. పేరిట లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా సచివాలయం పరిధిలో వివిధ పథకాల కింద లబ్ధిదారులకు మంజూరు చేసిన వివరాలకు సంబంధించిన జగనే మా నమ్మకం పోస్టర్‌ను ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన గురించి వివరించాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో వచ్చిన మార్పులను ప్రజలు గమనించాలన్నారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకొని ఇంకా అందని వారు ఉంటే వారికి అందేలా కృషి చేయాలని సూచించారు.

అన్ని విధాల అభివృద్ధి

జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సచివాలయానికి సంబంధించి వివిధ పథకాల కింద రూ.14.96 కోట్లు మంజూరైనట్లు ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగి రాష్ట్రం, మనం అన్ని విధాల అభివృద్ధి చెందుతామన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని ప్రజలకు హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... అన్న అంశంపై పార్టీ నాయకులకు వివరించి ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. వేదిక సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆనంద్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ మేరకు ప్రయోజనం అందుకున్నారనేది లబ్ధిదారులు తెలియజేశారు.


వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఆనంద్‌కుమార్

కార్యక్రమంలో ఏపీడీ శ్రీరాం యల్లపు వెంకటేశ్వరరావు, వివిధ వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, మండల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ క్లస్టర్ కన్వీనర్లు, సచివాలయ క్లస్టర్ కన్వీనర్లు, మాజీ కార్పొరేటర్లు, రాష్ట్ర కార్పొరేషన్ సభ్యులు, అనుబంధ సంఘాల సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింధియా: రాష్ట్రంలోని పేద, బలహీన వర్గాల ప్రజలకు అనేక పథకాలను అందించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్‌లో సుమారు రూ. 25 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి, దుర్గానగర్‌లో రూ. 6.50 లక్షలతో ర్యాంపు నిర్మాణానికి, గుడివాడ అప్పన్న కాలనీలో రూ.13.50 లక్షలతో మెట్లు, రూ.14.80 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు బల్ల లక్ష్మణరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల నాణ్యతలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తన దృష్టికి వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

ఆడారి సొంత నిధులతో చర్చిలో సదుపాయాలు

ఎన్టీఆర్ కాలనీలో ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో చర్చిలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. గురువారం ఈ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి భోగవిల్లి నాగభూషణం, నక్కా సూర్యనారాయణ, భారతి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు ప్రారంభం


గౌరీపరమేశ్వరులను ప్రతిష్ఠించి పూజ చేస్తున్న వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల ప్రతిష్టా మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, స్థానిక నాయకులు బుద్ద శివసత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ ఏడాది కాలనీలో గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం ప్రత్యేక కుంకుమ పూజలు, డిసెంబర్ 3వ తేదీ ఆదివారం మధ్యాహ్నం అన్నసంతర్పణ, 4వ తేదీ సోమవారం దీపోత్సవం, 9వ తేదీ శనివారం సాయంత్రం గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

19న స్కంద షష్ఠి

కంచరపాలెం: ఈ నెల 19న కార్తీక మాస శుద్ధ స్కంద షష్ఠి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శరవణ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 5 గంటలకు కలశ స్థాపన, గోక్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పన్నీరు, చందన, అన్నాభిషేకాలు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దేవాల రాజు(కృష్ణ) తెలిపారు. సాయంత్రం 5 గంటలకు వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు తిలకించి తరలించాలని ఆయన కోరారు.

అగ్నిప్రమాద బాధితురాలికి సరకుల పంపిణీ


బాధిత కుటుంబానికి సరకులు అందిస్తున్న రామ్మోహన్‌నాయుడు

మల్కాపురం: అగ్ని ప్రమాద బాధితురాలికి స్థానిక టీడీపీ నాయకుడు రామ్మోహన్ నాయుడు సహకారం అందించారు. 58వ వార్డు చిన్న ములగాడ వద్ద రమణమ్మ అనే వృద్ధురాలి పాన్‌షాపు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. దీంతో జీవనాధారం కోల్పోయిన రమణమ్మను రామ్మోహన్ నాయుడు పరామర్శించి, నెలకు సరిపడా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


జగదీష్ మృతదేహం

గోపాలపట్నం: మనస్తాపంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన శివనగర్‌లో జరిగింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 53వ వార్డు శివనగర్‌లో గంటాల జగదీష్(52) అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు గడియ వేసుకుని ఫ్యాను హుక్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. కొద్ది సేపటి తరువాత కుటుంబ సభ్యులు గమనించి తలుపులు తెరిచి చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సివిల్ కాంట్రాక్ట్ వర్క్స్ చేసేవాడు. పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లి ఇటీవలే తిరిగొచ్చాడు. 15 రోజుల కిందటే శివనగర్‌లోని అద్దె ఇంట్లోకి మారారు. అప్పటి నుంచి ఇంట్లో ముభావంగా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జగదీష్ మృతికి ఆర్థిక ఇబ్బందులు కారణమై ఉండొచ్చని చెబుతున్నారు. మృతుడికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు పూజిత, వికాసిని ఉన్నారు.

ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గం

మల్కాపురం: జింక్ ఆంజనేయస్వామి ఆలయం నూతన పాలకవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేసింది. ఆలయ ఆవరణలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి పాలకమండలి చైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుతూ, దేవాలయ పవిత్రతకు మచ్చ రాకుండా నూతన పాలకవర్గం మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి అండగా నిలవండి

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి అండగా నిలవాలని పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ కోరారు. 58వ వార్డు గుల్లలపాలెం వద్ద కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు పరిధిలో గడిచిన రెండేళ్లలో రూ.14 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇంకా రూ. 5 కోట్లతో మరిన్ని పనులు చేపట్టనున్నామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో పాత బీటీ రోడ్డుకు మెరుగులు దిద్ది కొత్త రోడ్లుగా చూపి, అదే అభివృద్ధిగా ప్రజలను మాయ చేసేవారన్నారు. గ్రాఫిక్స్‌లో అభివృద్ధి చూపే నైజం టీడీపీది అయితే వాస్తవంగా అభివృద్ధి చేయడం తమ పార్టీ నైజం అన్నారు. ఎన్నికలలో ఏ హామీ ఇచ్చామో దాని ప్రకారం చేసి చూపిస్తున్నామన్నారు. వార్డులో అధునాతన సౌకర్యాలతో ఆస్పత్రి, పలు ప్రాంతాల్లో బీటీ, సీసీ రోడ్లు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వాంబే ఇళ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, ఓపెన్‌జిమ్‌ల ఏర్పాటు వంటి ఎన్నో పనులు చేపట్టామన్నారు. అభివృద్ధిని ప్రజలు గమనించేలా వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావులతో పాటు పార్టీ నాయకులు అంగ రామ్‌ప్రసాద్, భోగవల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్లు

ఆదర్శంగా గ్రంథాలయాలు


పెయింటింగ్స్ చూపుతున్న అతిథులు, విద్యార్థులు

మల్కాపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం మల్కాపురం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది పాల్గొని వివిధ చిత్రాలు గీసి ప్రతిభ చూపారు. అతిథిగా హాజరైన రాష్ట్ర గ్రంథాలయ ప్రతినిధి మహేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని శాఖా గ్రంథాలయాలను డిజిటలైజ్ చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో గ్రంథాలయాలను తీర్చిదిద్దేందుకు ఇటీవల ప్రభుత్వం బ్రిటన్ దేశంతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ఆర్.సి.హెచ్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు చవితి శోభ


కంచరపాలెం రైతుబజారులో వినియోగదారుల రద్దీ


కంచరపాలెం కూడలిలో నాగుల చవితి పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: నాగుల చవితి సందర్భంగా గురువారం రైతుబజార్లు, మార్కెట్లు వినియోగదారులతో కళకళలాడాయి. కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో నాగుల చవితి పూజా సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి. శుక్రవారం జరగనున్న నాగుల చవితికి కంచరపాలెంలో పుట్టలు సిద్ధం చేశారు. కొబ్బరికాయలు, అరటిపండ్లు, పూలు, పత్రి, నూలు, తాటిటెంకలు తదితర సామగ్రికి డిమాండ్ ఉండటంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయించారు. కంచరపాలెం రైతుబజారులో వీటి ధరలు కాస్తా చౌకగా ఉండటంతో వినియోగదారులు కొనుగోలు చేశారు. కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో వారిని ఫ్లైఓవర్ వంతెనపైకి తరలించారు. సాయంత్రం రహదారులు వినియోగదారులు, వ్యాపారులతో రద్దీగా మారాయి. ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు నేతృత్వంలో సిబ్బంది వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

బీఎంఎస్ గెలుపుతో కార్మికులకు మేలు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో ఈ నెల 18న జరిగే ఎన్నికల్లో బీఎంఎస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. షిప్‌యార్డ్ బీఎంఎస్ ప్యానెల్‌పై పోటీ చేసే అభ్యర్థులు, సానుభూతిపరులు, కార్మికులు బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ షిప్‌యార్డ్ ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగుల సమస్యలపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో, షిప్‌యార్డ్ చైర్మన్ హేమంత్‌ఖత్రితో చర్చలు జరిపామన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. షిప్‌యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తు న్న ఎల్‌అండ్‌ఎం సిరీస్ ఉద్యోగులు బీఎంఎస్ యూనియన్‌పై విశ్వాసం ఉంచి గెలిపించుకోవాలన్నారు.

ఖార్వేల్‌నగర్‌లో త్వరలోనే రోడ్డు నిర్మాణం


ఖార్వేల్‌నగర్‌లో రహదారిని పరిశీలిస్తున్న అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు


చంద్రనగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న గోపాలకృష్ణ, గేదెల మురళీకృష్ణ, పైడిరాజు

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ 89వ వార్డు నాయకుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు గురువారం ఖార్వేల్ నగర్‌లోని సూర్యానగర్‌లో పర్యటించారు. అక్కడి రహదారులను, స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ ప్రాంతంలో కొత్త రోడ్లు నిర్మించాలని ప్రతిపాదించారు. సూర్యానగర్ రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో నిర్మాణ సమయంలో ఇబ్బందులు ఏర్పడుతాయని స్థానికులు గోపాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పర్యటనలో షేక్‌హమాన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చంద్రనగర్‌లో రహదారుల పరిశీలన

జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌లో కొత్తగా నిర్మించిన రహదారులను గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఈ ప్రాంతంలో నిర్మించాల్సిన రోడ్ల గురించి స్థానికులతో మాట్లాడారు. పార్టీ వార్డు నాయకుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, సచివాలయ కార్యదర్శికి వివరించారు. జీవీఎంసీ నిధులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతం భీమిలి నియోజకవర్గంలో ఉన్నందున ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. షేక్ రహమాన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్.కృష్ణ అన్నారు. వార్డు పరిధిలో జరుగుతున్న అంతర్గత రహదారుల నిర్మాణాన్ని స్థానిక నాయకులతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ వార్డు పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించేలా కాలనీ పెద్దలు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు చేస్తుండటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జియ్యాని విజయ్ తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న కృష్ణ, విజయ్ తదితరులు

ఆటో సుందర్ సేవానిరతి


గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రి వద్దకు ఆటోలో గర్భిణిని తీసుకొచ్చిన సుందర్

గోపాలపట్నం: అర్ధరాత్రి సమయంలో, గర్భిణిని సకాలంలో ఆస్పత్రికి ఉచితంగా తరలించి సేవానిరతిని చాటుకున్నాడు గోపాలపట్నం ఇందిరానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సుందర్ కుమార్. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఆశ వర్కర్ శ్యామల ప్రమీలకు పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు ఆటో డ్రైవర్‌కు తెలియజేసి ఆస్పత్రికి తీసుకువెళ్లాలని కోరగా, వెంటనే వచ్చి ఆటోలో గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రికి ఉచితంగా తరలించారు. సుందర్ సేవలను స్థానికులు కొనియాడారు.

పరిశుభ్రంగా రహదారి


రహదారిని నీటితో కడుగుతున్న జీవీఎంసీ సిబ్బంది


కొండవాలు ప్రాంతాన్ని సిబ్బందితో శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు కుమారి కల్యాణ మండపం వద్ద లక్ష్మీనగర్‌కు వెళ్లే దారిలో రహదారిపై మట్టి ఉండటం వల్ల వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి కొండవాలు ప్రాంతం నుంచి మట్టి జారిపడుతోందని, దీనివల్ల వాహన చోదకులు జారిపడుతున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదు రావడంతో జీవీఎంసీ శానిటరీ సిబ్బంది రహదారిని శుభ్రం చేశారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు రహదారిపై మట్టిని తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు పర్యవేక్షణలో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు తదితరులు మట్టిని తొలగించి, నీటితో రోడ్డును కడిగారు. స్థానికులు, ప్రయాణికులు జీవీఎంసీ సిబ్బందిని అభినందించారు.

ట్రాఫిక్ నియంత్రణకు మైక్‌సెట్ ఉపయోగకరం

కంచరపాలెం: ట్రాఫిక్ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ అన్నారు. కంచరపాలెం వై జంక్షన్ నేతాజీ వంతెన వద్ద గల పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌కు గురువారం 56వ వార్డు గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘానికి చెందిన పెంటకోట నూకరాజు మైక్‌సెట్ వితరణ చేశారు. దీనిని ముఖ్య అతిథిగా ఏసీపీ ప్రారంభించి మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు మైక్‌సెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఎస్‌ఐలు వాసుదేవ రావు, పాపారావు ఉల్లాక్, సంఘ అధ్యక్షుడు వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆడారి శ్రీను, కొణతాల నర్సింగరావు, మాజీ అధ్యక్షుడు మళ్ల శంకరరావు, బలరామ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


మైక్‌సెట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

గోపాలపట్నం: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గోపాలపట్నం సీఐ అశోక్ కుమార్ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై నారాయణ కళాశాల విద్యార్థులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉన్నది ప్రమాదాలు నివారించడానికే అని తెలిపారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. అతి వేగంతో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్ కుమార్

అనాథ శవానికి అంత్యక్రియలు

విశాఖ విద్య: అనాథ శవానికి మమత చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎల్లేటి మమత ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కొన్ని రోజుల కిందట కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతిచెందారు. ఆమె కుటుంబ సభ్యులెవ్వరూ లేకపోవడంతో మమత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు మమతకు కేజీహెచ్ నుంచి సమాచారం అందించారు. దీంతో ఆమె ఆ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మమతను పలువురు అభినందించారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

పబ్లిక్ డిమాండ్

వీధిలైట్లు వెలిగించండి..!

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల్లోని ఊర్వశి కూడలి, కంచరపాలెం పరిధి గౌరీనగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో చీకట్లు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడి విద్యుత్ స్తంభాలకు లైట్లు లేకపోవడం, మరికొన్ని చోట్ల లైట్లు పనిచేయకపోవడంతో వీధుల్లో అంధకారం నెలకొంది. నెల రోజులుగా 44బీ/7/2 నుంచి 9/3 వరకు గల విద్యుత్ స్తంభాలకు లైట్లు పనిచేయడం లేదు. రాత్రి వేళలో రాకపోకలు సాగించేందుకు పాదచారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు చేపట్టాలి.

– జ్యోతిర్మయి, గౌరీనగర్, ఊర్వశి జంక్షన్


గౌరీనగర్‌లో వెలగని విద్యుత్ లైట్లు

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com